


# ఆశాం

గోటేటి లలితా శేఖర్

ఎదురింటి కృష్ణమూర్తిని చూస్తుంటే రామారావుకు వళ్ళు మండి పోతూంది. కారణం పర్టిక్యులర్‌గా ఇది అని చెప్పలేం.

రామారావూ కృష్ణమూర్తీ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఏడాది క్రితం కృష్ణమూర్తి కడప నుంచీ ట్రాన్స్‌ఫర్ అయి ఈ వూరొచ్చాడు. వచ్చిన రోజునే ఎంతో వినయంగా తనని పరిచయం చేసుకొని "మీ పేటలో ఏమైనా ఇళ్ళు అద్దెకు దొరుకుతాయా రామారావుగారూ?" అని అడిగాడు కృష్ణమూర్తి.

రామారావుంటున్న ఇంటికి ఎదురిల్లు ఖాళీగా వుండటంతో ఇల్లుగలాయన రామారావుకు దగ్గర వాడవటంతో ఆ ఇల్లు కృష్ణమూర్తికి ఓ వందకు తక్కువకే ఇప్పించాడు. చాలా వసతైన ఇల్లు. ఆఫీసు దగ్గర. మరీ రైలు పెట్టెల్లా కాకుండా ముందు చిన్న వరండా, కొబ్బరి చెట్లూ, పూల మొక్కలూ, ఇల్లుగలాయన హైదరాబాద్‌లో మకాం వుండటంతో, ఇంటివాళ్ళ పోరు కూడా వుండదు. ఎప్పుడూ నీరు ఎండని బావి. మునిసిపాలిటీవారి కుళాయి అన్ని హంగులూ వున్న ఇల్లు.

"ఎలా వుంది ఇల్లు!"

అడిగాడు రామారావు కృష్ణమూర్తిని.

"బాగుంది" అన్నాడు పొడిగా కృష్ణమూర్తి.

ఇంతమంచి ఇల్లు తక్కువ అద్దెకు ఇప్పించినందుకు తనకెంతో కృతజ్ఞతలు చెపుతాడనుకున్నాడు రామారావు.



తన భార్యా, పిల్లలు నాలుగు రోజులలో వస్తున్నట్టుగా చెప్పాడు కృష్ణమూర్తి రామారావుతో.

"ఈ రోజు మీ భోజనం మా ఇంట్లో" అన్నాడు రామారావు కృష్ణమూర్తితో.

"ఎందుకండీ, హోటల్ భోజనం అలవాటే నాకు" అన్నాడు కృష్ణమూర్తి మొహమాటంగా.

"మీ చెల్లెలి చేతి వంట రుచి చూడరూ మరీ?" అన్నాడు ఎంతో ఆదరణ చూపించాననుకొంటూ.

చివరకు 'సరే' ననిపించారు కృష్ణమూర్తి చేత.

రామారావు భార్య సరళ చాలా అణుకువ గల స్త్రీ. వంట అద్భుతంగా చేస్తుంది.

తలొంచుకుని భోజనం చేస్తున్న కృష్ణమూర్తితో రామారావు...

"ఎలావుంది! పనస పొట్టు కూర?" అంటూ కళ్ళెగరేశాడు.

దానికి కృష్ణమూర్తి సరళ వేపు చూస్తూ "బాగుందమ్మా చాలా రుచిగా చేశావు" అని అభినందించారు.

వక్కపొడి అందిస్తూ రామారావు "ఒరే రవీ ఇలారా" అని కొడుకుని పిలిచి వీడు టెన్త్ స్కూలుకే ఫస్టు వచ్చాడు. ఇక పాప శారద సెవెన్త్ చదువుతూంది పాటలు బాగా పాడుతుంది. వాళ్ళమ్మలాగే అన్నాడు నవ్వేస్తూ—

"అలాగా" అన్నాడు నింపాదిగా కృష్ణమూర్తి. కూతుర్ని పాడమంటాడను కున్నాడు, అనలేదు.

"ఏమిటీ మీరు రిజర్వ్‌డ్ అనుకుంటాను. ఏమీ మాట్లాడటం లేదు" అన్నాడు రామారావు

దానికి కృష్ణమూర్తి చిరునవ్వుతో "మీరు చెవుతున్నారు. నేను వింటున్నాను" అన్నాడు.

కృష్ణమూర్తి గోడకు తగిలించిన ఫోటో చూస్తూ "ఆయనెవరు?" అని అడిగాడు రామారావును.

రామారావు ఉత్సాహంగా "ఆ ఫోటోలో వున్న ఇద్దరిలో కుడిచేతి వైపు కూర్చున్నాయన ప్రముఖ దేశభక్తుడూ, కవి, స్వాతంత్ర్య సమరయోధుడు నారాయణపంతులుగారి పేరు వినే వుంటారు" కృష్ణమూర్తి ఏదో చెప్పబో యారు.

అతనికా అవకాశం ఇవ్వకుండా రామారావే చెప్పటం మొదలుపెట్టాడు. "ఎడమ వైపు కూర్చున్నది మా నాన్నగారు. వారిద్దరూ మంచి స్నేహితు లట. మా నాన్నగారు కూడా స్వాతంత్ర్య పోరాటంలో జైలు కెళ్ళారుట. ఆయన యావదాస్తి కూడా దేశం కోసం ఖర్చు చేశారు. కాబట్టే మనమి లాగ ఉద్యోగం చెయ్యాల్సొచ్చింది, జమీందారీ కుటుంబమైనా" కొంచెం అతిశయంగా చెప్పాడు రామారావు.

కృష్ణమూర్తి ఇంటికి బయలుదేరడంతో ఆ సంభాషణ ముగిసింది.

వచ్చిన పది రోజుల్లోనే కృష్ణమూర్తి ఆఫీసులో అందరి అభిమానాన్ని పొందాడు. పని పెండింగ్ వుంచడు. ఇతరుల పనిలో కూడా సహాయ పడేవాడు. ఆఫీసర్ మెప్పు పొందినట్టుగా బంట్రోతు మల్లయ్య రామారావు చెవిన వేశాడు.

"కొందరు అతిగా పోతారు. అందరూ మంచివాడను కోవాలని. అదొక ఆనందం వాళ్ళకు" అని సరిపెట్టుకున్నాడు రామారావు.

ఆరోజు సరళ రామారావుతో అంది.

"ఏమండీ ఎదురింటి ఒదినగారూ, పిల్లలు వచ్చారు. అదేనండీ కృష్ణమూ ర్తిగారి భార్యండీ" అంది ఇంకా వివరిస్తూ—

"ఆహా!" అన్నాడు రామారావు.

"వాళ్ళ పిల్లలు ఎంత ముద్దుగా అందంగా వున్నారనుకొన్నారు?

స్వప్న పెద్దది, శాంతి చిన్నది. పెద్ద పిల్ల స్టేట్ ర్యాంక్ వచ్చిందటండీ, చిన్నది వీణ ఎంతబాగా వాయిస్తుందను కొన్నారు. వీధిలో నిలబడితే విన బడుతూంది. ఎవరో అనుకున్నాను. మన పిల్లలు చెప్పారు. అప్పుడే పిల్లలంతా స్నేహితులై పోయారు.

"సాయంత్రం వెడదామా వాళ్ళింటికి?" అని అడిగింది సరళ రామారావుని.

సరళ సంబరం చూస్తే రామారావుకు మండింది.

"ఎందుకు పిలవని పేరంటానికి? కర్టెసీకైనా మా ఇంటికి రండి అన్నాడూ. శుభ్రంగా భోంచేసి పోయాడు" అన్నాడు రామారావు అసహనంగా.

"అదేం మాటలండీ. వాళ్ళు మొన్ననేగా వచ్చిందీ. ఇంకా సర్దుకో లేదేమో" అంది నొచ్చుకుంటూ సరళ.

ఆఫీసులో పని వత్తిడి ఎక్కువగా వుండటంతో కాస్త ఆలస్యంగా వస్తు న్నాడు కృష్ణమూర్తి ఇంటికి. ప్రొద్దున్న ఒక గంట ముందుగా వెడుతున్నాడు. ఆఫీసులో కూడా విష్ చేసుకోవడం, చిరునవ్వులు తప్ప, పెద్ద సంభాషణలు లేవు కృష్ణమూర్తి, రామారావుల మధ్య.

ఆరోజు ఆదివారం ప్రొద్దున పేపరు చూస్తున్నాడు రామారావు. గుమ్మం తెర కవతల ఎవరో తచ్చాడినట్టయింది. ఎవరూ అంటూ కర్టెన్ లాగాడు. ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు ఆమెను తనెప్పుడూ చూడలేదు.

"సరళ గారున్నారండీ" అంటూ లోనికి అడుగేసింది ఆమె. "వుంది లోపలి కెళ్ళండి" అన్నాడు రామారావు.

పచ్చటి దేహచ్ఛాయ, చామంతి రంగు చీరలో కలిసిపోయింది. కాలి మువ్వలు సన్నగా శబ్దం చేస్తుంటే, ఇంట్లోకి వెళ్ళింది ఆమె. "ఎంత అందంగా వుందీమె!" అనుకోకుండా వుండలేకపోయాడు రామారావు.

వచ్చినావిడ పది నిముషాల్లో వెళ్ళిపోయింది. ఆవిడను గేటుదాక సాగ నంపి వచ్చి సరళ సంతోషంగా రామారావుతో అంది.

"ఈమె కృష్ణమూర్తి భార్య రాధండీ. ఎంత మంచిదనుకున్నారు. ఈ రోజు కృష్ణమూర్తన్నయ్య పుట్టినరోజట గులాబ్‌జామ్‌లు చేసి కేరియర్ నిండుగా పట్టుకొచ్చింది. అచ్చంగా కోవాతో చేసింది చూడండి" అంటూ కప్పులో నాలుగువేసి ఇచ్చింది రామారావుకు.

రామారావు నోట్లో గులాబ్‌జామ్‌లు తియ్యగానే కరుగుతున్నాయి. మనసు మాత్రం చేదు అనుభవానికి లోనైంది. తింటూ ఆలోచిస్తున్నాడు రామారావు.

అందుకే గాబోలు కృష్ణమూర్తికి ఇంత గర్వం. అందమైన భార్య, చక్కటి పిల్లలు, అహంభావి. మితభాషిట. తన పట్ల ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తి స్తాడు? అలా మొదలైన ద్వేషభావం వేగంగా పెరగసాగింది.

ఆ సాయంత్రం వుండబట్టలేక బజారు కెడుతున్న కృష్ణమూర్తిని ఆపి, 'ఈ రోజు మీ పుట్టిన రోజట కదూ? మా కాహ్వానం లేదేమిటి?" అని అడిగేశాడు రామారావు.

"ఎంతమాట!... మీ కెప్పుడూ ఆహ్వానమే. ఒక రోజేమిటి? అయినా ఆమె చాదస్తం కానీ ఇంకా చిన్న పిల్లాడికి చేస్తున్నట్టు" అని నవ్వాడు కృష్ణమూర్తి.

ఆ నవ్వు రామారావు గుండెలో మండింది.

"చూశావా నేనంటే మా ఆవిడకెంత ప్రేమో?" అన్నట్లు ధ్వనించింది.

xx xxxx xx xxxx xx

ఆఫీసుకెడుతూంటే సరళ అంది రామారావుతో—

"పూళ్ళో వున్న మా పెద్దమ్మను చూసొస్తాను. తాళం చెవులు రాధగారి

"కిచ్చి వెడతాను సాయంత్రం తీసుకోండి." అని

చెప్పినట్టుగానే ఆ సాయంత్రం తాళంచెవి తీసుకోవడం కోసం కృష్ణమూర్తి ఇంట్లోకెళ్ళాడు రామారావు. రాధ వంటింట్లో వుంది. పిల్లలూ, కృష్ణమూర్తీ ఇంకా వచ్చినట్టులేదు.

పొందికగా, పరిశుభ్రంగా వున్న ఇంటిని పరికించి చూస్తున్న రామారావు దృష్టి టి.వి. పై నుంచిన ఫొటోఫ్రేమ్‌పై బడింది. చూస్తుండంగా రాధ వచ్చింది.

"తాళం ఇచ్చిందాండీ!" అన్నాడు రామారావు.

"ఎంతసేపయిందండీ వచ్చి? పట్టుకొస్తాను" అంటూ క్షణంలో వచ్చింది రాధ.

"ఆ ఫొటోలో వున్న దెవరు?" అని అడిగాడు ఆశ్చర్యంగా రామారావు రాధను.

"మధ్యలో కూర్చున్నది మా మావయ్యగారు నారాయణ పంతులుగారు, కుడివైపు మావారు. ఎడమవైపు మా బావగారు రఘురామయ్యగారు" అంది రాధ.

వెళ్ళొస్తానని చెప్పి ఆశ్చర్యం నుండి తేరుకోకుండానే ఇంట్లో కదుగు పెట్టాడు రామారావు. బట్టలు కూడా మార్చుకోకుండానే కుర్చీలో కూర్చున్నాడు.

"తనెంతో గొప్పగా తన తండ్రి స్నేహితుడని, కవి, దేశభక్తి పరాయణుడు అని స్తోత్రం చేస్తుంటే, ఒక్కమాటైనా చెప్పచ్చుగా. ఆయన సుపుత్రుణ్ణని. మరీ ఇంత గర్వమా? ఛీ ఇలాంటి వాడికి ఇల్లిప్పించడం నాదే తప్పు. ఏమిటో వీడి బోడి బడాయి. ఏమనుకొంటున్నాడో. ఈ రోజు నుండీ ఆ వెధవను పలకరించను."

ఆ రోజు నుండీ తన నిర్ణయాన్ని అమలుచేశాడు రామారావు. ఆఫీసులో వాళ్ళ దగ్గరా వీరిదగ్గరా అతనిని హేళనచేసి మాట్లాడటం, గర్విష్టి అనడం జరుగుతూండేది.

రామారావు ప్రవర్తనకు అర్థం తెలియక విస్తుపోయేవాడు కృష్ణమూర్తి.

ఆఫీసు పనిమీద హైదరాబాదు వెళ్ళాల్సొచ్చింది రామారావుకు.

రామారావుకు ఒక ఆలోచన వచ్చింది. "ఎలాగూ తను హైదరాబాదు వెళుతున్నాడు కాబట్టి శ్రీనివాసరావుతో (కృష్ణమూర్తి ఇల్లు గలాయన) చెప్పి ఏదో వంకన ఇల్లు ఖాళీ చేయిస్తాను. అప్పుడుగానీ వీడి రోగం కుదరదు. తనకూ ప్రొద్దుటే ఈ వెధవ మొహాన్ని చూసే అవస్థ తప్పుతుంది." అనుకున్నాడు.

రామారావులో కృష్ణమూర్తిపట్ల ద్వేషం ఆ స్థాయికి చేరుకుంది.

అనుకున్నట్టుగానే రామారావు హైదరాబాదు వెళ్ళాడు. కానీ ఆ సమయానికి కృష్ణమూర్తి ఇంటి ఓనరు ఊళ్ళోలేకపోవడంతో విషయం ప్రస్తావించడం జరగలేదు.

ఆఫీసు పని తెములక రామారావు మూడురోజులుండిపోవల్సి వచ్చింది హైదరాబాదులో. నాలుగోరోజు ఇంటికి చేరాడు. ఇంట్లో అడుగు పెట్టేసరికి, పాప శారద సిమెంట్ కట్టులో చేతికి బేండేజ్‌తో మంచంమీద పడుకుని వుంది.

సరళ రామారావును చూస్తూనే కళ్ళనీరు పెట్టుకొంది.

"ఏమైంది?" కంగారుగా అడిగాడు రామారావు సరళను.

"కృష్ణమూర్తి అన్నయ్య గారుండబట్టి సరిపోయింది. లేకపోతే ఏమయ్యేదో!" అంది సరళ.

"అసలేం జరిగిందంటే?" విసుగ్గా అడిగాడు రామారావు.


"శారద స్కూలునుంచి ఇంటికి వస్తూ రోడ్డు దాటబోయి స్పీడుగా వస్తున్న స్కూటరును చూడలేదట. సమయానికి అటే వస్తున్న కృష్ణమూర్తి పాపను వెంటనే హాస్పిటల్లో చేర్చి ఇంటికి కబురు చేశాట్ట. చేతిఎముక విరగడంతో ప్లాస్టర్ వేశారు. ప్రమాదకరమైన దెబ్బలు తగులలేదట. కృష్ణమూర్తి ఆరోజు, మర్నాడు కూడా ఆఫీసుకు తెలవుపెట్టి పాప దగ్గరే వుండి పోయాడుట.

ఈ మూడు రోజులు నన్ను వంట కూడా చెయ్యనియ్యలేదు రాధ తనే కారియర్ పంపించింది. తోడబుట్టిన వారికంటే కూడా ఎక్కువే ప్రేమ చూపించారు. వాళ్ళ ఋణం తీర్చుకోలేం" అంటూ కళ్ళు తుడుచుకొంటూ చెప్పింది సరళ రామారావుతో.

అంతా విన్నాక ఎలాగో అయింది రామారావుకు. శారద ప్రక్కనే కూర్చుని నుదిటిమీద చెయ్యివేసి "ఎలావుంది తల్లీ! నొప్పి తగ్గిందమ్మా"అన్నాడు బాధగా.

"కొద్ది రోజుల్లో కట్టు తీస్తారుట నాన్నా! అంకుల్ చెప్పారు. మొదటిరోజు బాగా నెప్పివుందిగానీ, ఇప్పుడు లేదు. మరేమో అంకుల్ హాస్పిటల్‌లో నా ప్రక్కనే కూర్చొని మంచి మంచి కథలు చెప్పారు" అంది నవ్వుముఖంతో పాప.

"అలాగేం..." అంటూ పాప నుదిటిని ముద్దుపెట్టుకున్నాడు. రామారావుకు








పిల్లలంటే ప్రాణం.

కృష్ణమూర్తి రామారావుపట్ల చూపించిన స్నేహభావం, విజాయితీ పాప మాటల్లో వ్యక్తమౌతోంది.

రామారావు తనలో తను కుంచించుకుపోయాడు. పరస్పర విరుద్ధమైన భావాలు ఒకటిగా మిళితమైనప్పుడు రెండూపోయి ఒక రకమైన నిర్వికార స్థితి ఏర్పడుతుంది.

రామారావొచ్చినట్టు తెలియగానే కృష్ణమూర్తి వచ్చి పాపకు తీయించిన 'ఎక్సరేలు, మందుల జాబితా ఇచ్చి వివరాలు చెప్పాడు.

"మీకు చాలా శ్రమ కలిగింది" అన్నాడు రామారావు ఎలాగో గొంతు పెగల్చుకొని. "శ్రమ ఏమీలేదు పాప లేచి ఇదివరకులా ఆడుతూ, పాడుతుంటే అదేచాలు" అని వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

రోజులు గడిచాయి. పాపకు కట్టు విప్పారు. చెయ్యి మామూలుగా కదపగలుగుతోంది. పిల్లలంతా ఎప్పటిలా కలసి ఆడుకొంటున్నారు.

ఇదివరకులా ఇప్పుడు రామారావుకు కృష్ణమూర్తిని చూస్తే వళ్ళుమండటం లేదు. కానీ మనసు విప్పి మాట్లాడలేకపోతున్నాడు.

ఆ రోజు ఇంకా పూర్తిగా తెల్లవారకుండానే లేచాడు రామారావు. అతని మనసెందుకో ప్రశాంతంగా వుంది. పౌర్ణమి కాబోలు ఆ రోజు తెల్లటి వెన్నెల కిటికీ గుండా పక్కమీద పరచుకొంది. చల్లటి గాలి. మెడమీద చేతులేసుకొని పడుకున్న పాప అతనినే చూస్తోంది.

"అప్పుడే మెలకు వచ్చిందమ్మా?" అన్నాడు రామారావు కూతురు తల నిమురుతూ—

"నాన్నా! అంకుల్ నాకొక మంచి పాట నేర్పారు సినిమాపాట పాడనా?" అంది ఉత్సాహంగా.

'పాడమ్మా' అన్నాడు రామారావు.

శారద కూర్చుని పాడసాగింది.

"పిల్లలూ, దేవుడూ చల్లనివారే<br>
కల్లకపట మెరుగనీ కరుణామయులే<br>
పుట్టినపుడు మనిషి మనసు తెరచియుండును<br>
ఆ పురిటికందు మనసులో దైవముండును<br>
వయసు పెరిగి, ఈసు కలిగి మదము హెచ్చితే<br>
అంత మనిషిలోని దేముడే మాయమగునులే<br>
మనిషి మనసు అనే సూర్యుణ్ణి కోపం మూయును<br>
గాలివీచి మబ్బు తెరలు కదలిపోవులే<br>
మాట కలుపుకొన్న కోపమే చెలిమి అగునులే<br>
మాయమర్మ మేమిలేని బాలలందరూ ఈ భూమిపైన వెలసిన పుణ్య మూర్తులే.<br>
తప్పులు మన్నించుటే దేముని సుగుణం<br>
ఇది గొప్పవాళ్ళు చెప్పినట్టి చక్కని న్యాయం<br>
పిల్లలూ, దేముడూ చల్లనివారే"....

ఎంతో శ్రావ్యంగా పాడుతోంది పాప శారద. కేవలం చెవులతోనే గాక మనసుతో కూడా వింటున్నాడు రామారావు పాటను. అతని మనసెంతో తేలికైంది. "చాలా మంచిపాట నేర్పించారు నీకు మీ అంకుల్" అన్నాడు రామారావు మనస్ఫూర్తిగా.

స్నానంచేసి బట్టలు వేసుకొని రామారావు కృష్ణమూర్తి ఇంటికెళ్ళబోతుంటే కృష్ణమూర్తి దంపతులే వచ్చారు. "రామారావుగారూ! నాకు విజయవాడ ట్రాన్స్ఫర్ అయ్యిందండీ. రేపు జాయిన్ అవుతున్నాను" అన్నాడు కృష్ణమూర్తి.

◆

# నేలకూలిన తారాజువ్వ



ఊరి నుంచి మిత్రుడి మరణవార్త! ఆత్మహత్య!<br>
దివిటీలు కొట్టీకొట్టగానే దీపావళి ముగిసింది!<br>
పాళ్ళు కల్తీ అయిన తారాజువ్వ నేలకొరిగింది!<br>
పాడుకాలం కాలవ కెరటమై<br>
చమురు బోలెడు మిగిలుండగానే<br>
కార్తీక దీపాన్ని కబళించింది!

***

తీతువేదో ముక్కుతో<br>
ఈ బండరాతి మీద పొడిచినట్టైంది –<br>
అంతే, అంతకు మించి ఏం లేదు,<br>
అకస్మాత్తుగా కొంగనోట చిక్కిన చేపపిల్లై<br>
ఈ గుండె విలవిలలాడనే లేదు.<br>
వార్త ఏదైనా – కనీసం – ఒకేలా 'కీచు'మనే<br>
టెలిప్రింటర్నైనా కానా –<br>
తడి అలజడి లేనేలేదు నాలో?<br>
బతుకు పిరమిడ్లో బలికున్న మమ్మీన్నైనానా?<br>
మెగా నగరపు టెడారిలో<br>
రాగం, ద్వేషం అంటని గులకరాయిన్నైనానా?

***

అవునొరే గోపిగా!<br>
వెన్నెల రాత్రుల్లో కాలవ రేవు మెట్ల మీద<br>
పలికించిన నీ జిజ్ఞాసాగీతానికి<br>
చివరి ఊపిరిలోనైనా జవాబు దొరికిందా?<br>
కాక్టెయిల్ కార్చిచ్చులో<br>
కాకలు తీరిన నీ సందేహాలు<br>
చితిమంటల్లోనైనా చల్లారాయా?<br>
ఇక్కడి ప్లానెటోరియం సరసనే పాలరాతి గుడిలా నీలో<br>
తాల్వికుడి సరసనే తాగుబోతు –<br>
సుదుల జడుల మహాస్నానంతోనైనా<br>
వాడి దాహం తీరిందా?<br>
అయినవాళ్ళకు బరువై, గాయపడ్డ ఏరువై;<br>
లోకానికి లోకువై<br>
నీ నిరాశ పుట్టకురుపుకు<br>
విరుగుడు మందు కరువై<br>
విషగుళిక నావపై ఆ ఒడ్డు చేరావు –<br>
నువు కలవరించిన ఉనికి మూలవు<br>
పల్లవైనా ఆలకించావా?

***

ఒరే గోపిగా!<br>
చేతకానివాడా! ఈ రొచ్చుగుంట బతుకులో రంగ నేస్తవి వాడా!<br>
ఎవరు చూసినా, మానినా<br>
నువ్వెత్తిన తెల్లజెండాపై<br>
వికృత వ్యవస్థ 'త్రీడీ' బొమ్మ!

(ఆత్మహత్యకు 'గురైన' ఒక మిత్రుని స్మృతిలో)

– 'వి–రాగి'